RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in

# దేశ టైమ్స్ DESHA TIMES

తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | సెప్టెంబర్ 6 ఆదివారం 2026 | సంపుటి : 16 | సంచిక : 213 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాష
NALGONDA | SUNDAY SEPTEMBER 6 2026 | VOL:16 | ISSUE: 213 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# విద్యాశాఖలో కీలక మార్పులు.. టీచర్ల సమస్యలపై సీఎం రేవంత్ హామీ

**పెండింగ్ టీచర్ల పదోన్నతులు పూర్తి చేశామన్న రేవంత్**

**బదిలీలపై జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామన్న సీఎం**

**రెండేళ్లలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ**

**సాంకేతిక విద్యకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్న రేవంత్**

**పాలిటెక్నిక్ విధానంలో మార్పులు లేవని స్పష్టీకరణ**

విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకొస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులను పూర్తి చేశామని చెప్పారు. టీచర్ల బదిలీల విషయంలోనూ ప్రభుత్వం ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తోందన్నారు. కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. తల్లిదండ్రులతో సమానంగా పిల్లల భవిష్యత్తుకు పునాది వేసేది ఉపాధ్యాయులేనని రేవంత్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్ల సమయం ఇస్తే సమస్యలను పరిష్కరించి చూపిస్తానన్నారు. తాను

(మిగతా 2వ పేజీలో..)



## గ్లోబల్ లీడర్లలో మోదీ అత్యంత స్ఫూర్తిదాయకం: బెల్జియం ప్రధాని ప్రశంసల వర్షం

**మోదీ తెలివైన నాయకుడన్న బార్ట్ డె వెవర్**

**మోదీతో భేటీ కావడం తనకు లభించిన గౌరవమని వ్యాఖ్య**

**విశ్వవేదికపై భారత్ పాత్ర కీలకంగా మారిందన్న బెల్జియం ప్రధాని**



ప్రపంచ రాజకీయాల్లో తీవ్ర అస్థిరత, భౌగోళిక ఉద్రిక్తతలు నెలకొన్న ప్రస్తుత తరుణంలో భారత ప్రధాని మోదీ అనుసరిస్తున్న దౌత్య విధానాలు, నాయకత్వ పటిమపై బెల్జియం ప్రధాని బార్ట్ డె వెవర్ ప్రశంసలు కురిపించారు. ప్రపంచంలోని అత్యంత స్ఫూర్తిదాయకమైన, తెలివైన నేతల్లో మోదీ అగ్రగామి అని అభివర్ణించిన ఆయన... మోదీతో భేటీ కావడం తనకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచంలోని పలువురు అగ్రనేతల ప్రసంగాలు విన్నప్పుడు ఆందోళన, అభద్రతా భావం కలుగుతాయని...

(మిగతా 2వ పేజీలో..)

## కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి: పొన్నం ప్రభాకర్ డిమాండ్

**వెయ్యి రోజులుగా సభకు రాకుండా జీతం తీసుకుంటున్నారని ఆరోపణ**

**కేసీఆర్ వైఖరికి నిరసనగా 6న ఇందిరా పార్క్ వద్ద కాంగ్రెస్ మహా ధర్నా**

**సన్నాహక సమావేశంలో పాల్గొన్న మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు**

(మిగతా 2వ పేజీలో..)



## లక్కీ లాటరీ సీఎం రేవంత్‌ను కూల్చే రోజులు త్వరలోనే ఉన్నాయి: కేటీఆర్

**రేవంత్ ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అన్న కేటీఆర్**

**420 మోసాలకు గాను రేవంత్ 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్**

**మంత్రులు కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని ఆరోపణ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ యువతకు స్కిల్ లేదనడానికి రేవంత్ రెడ్డికి ఏ అర్హత ఉందని, ఆయన స్వయంగా ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన మోసాలపై బీఆర్ఎస్ నిర్వహించిన 'యువభేరి' సభలో పాల్గొన్న కేటీఆర్, కేవలం లక్కీ లాటరీ తగలడం వల్లే రేవంత్ సీఎం అయ్యారని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీనే గడగడలాడించిన తెలంగాణ యువశక్తికి

(మిగతా 2వ పేజీలో..)



## సమస్యలు గాలికొదిలేసి దేనికి ఈ సంబరాలు?: రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం

**వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం**

**సమస్యలను గాలికొదిలేసి వేడుకలు జరుపుకుంటున్నారంటూ హరీశ్ విమర్శ**

**ప్రభుత్వం కుంభకోణాలమయం అయిందని ఆరోపణ**



కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన వేడుకలను జరుపుకోవడంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ముఖం పెట్టుకుని సంబరాలు చేసుకుంటోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల తీరు 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అన్న చందంగా తయారైందని ఎద్దేవా చేశారు.

(మిగతా 2వ పేజీలో..)

## అది విద్యా వ్యవస్థా లేక కార్పొరేట్ దోపిడీ వ్యవస్థా?: ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల మోతపై రేవంత్‌ను నిలదీసిన కవిత

**ప్రైవేట్ స్కూళ్లు విచ్చలవిడిగా దోచుకుంటున్నాయని కవిత ఆగ్రహం**

**స్కూళ్ల ఫీజుల కట్టడికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని మండిపాటు**

**విద్యార్థుల తల్లిదండ్రుల జేబులు గుల్లవుతున్నా రేవంత్ మౌనం వహిస్తున్నారన్న కవిత**

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా సాగుతున్న ఫీజుల దోపిడీపై కల్వకుంట్ల కవిత

(మిగతా 2వ పేజీలో..)



## పెన్షనర్లకు చంద్రబాబు భారీ ఊరట.. అడిషనల్ క్వాంటం పెన్షన్ పునరుద్ధరణ.. ఉద్యోగులకు కీలక హామీలు

**గత ప్రభుత్వం రద్దు చేసిన అడిషనల్ క్వాంటం పెన్షన్ పునరుద్ధరణ**

**12వ పీఆర్సీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం**

**పెండింగులో ఉన్న రెండు డీఏల విడుదలకు గ్రీన్ సిగ్నల్**

**ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం వెల్లడి**

**ప్రభుత్వ నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేసిన ఉద్యోగ సంఘాల నేతలు**

రాష్ట్రంలోని రిటైర్డ్ ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు భారీ ఊరట కల్పించారు. గత ప్రభుత్వం రద్దు చేసిన 'అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్'ను పునరుద్ధరిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగ సంఘాలతో శనివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. దీనితో పాటు ఉద్యోగులు ఎదురుచూస్తున్న పలు పెండింగ్ సమస్యల పరిష్కారానికి కూడా ముఖ్యమంత్రి సానుకూలత వ్యక్తం చేశారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో జాయింట్

(మిగతా 2వ పేజీలో..)



RNI NO. TELTEL2010/34557 తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం



# విద్యాశాఖలో కీలక మార్పులు.. టీచర్ల సమస్యలపై సీఎం రేవంత్ హామీ

**మొదటి పేజీ తరువాయి)**

కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సీఎం చెప్పారు. సాంకేతిక విద్యకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యావిధానంలో ఎలాంటి మార్పులు చేయడం లేదని స్పష్టం చేశారు. విద్యాశాఖ కమిషన్ ద్వారా అనేక సమస్యలను పరిష్కరిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీఆర్సీ సమస్యను పరిష్కరించామని చెప్పారు. ఇటీవల ఇందిరాపార్క్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేయడం తనకు చాలా బాధ కలిగించిందన్నారు. కార్యక్రమానికి ముందు కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.

## సంపాదకీయం

# మారుతున్న జీవనశైలి.. పెరుగుతున్న ఒత్తిడి

అభివృద్ధితో పాటు ఆరోగ్యం, కుటుంబానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలి

ప్రస్తుత కాలంలో మనిషి జీవితం ఎంతో వేగంగా మారిపోయింది. సాంకేతికత అందుబాటులోకి రావడం, ఉద్యోగ అవకాశాలు పెరగడం, జీవన ప్రమాణాలు మెరుగుపడటం వంటి ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. అయితే ఈ మార్పులతో పాటు ఒత్తిడి, ఆందోళన, సమయాభావం కూడా పెరుగుతున్నాయి. ఒకప్పుడు కుటుంబంతో కలిసి గడిపేందుకు సమయం కేటాయించిన మనిషి.. నేడు ఉద్యోగం, ఆర్థిక అవసరాలు, సామాజిక మాధ్యమాలు, వ్యక్తిగత బాధ్యతల మధ్య పరుగులు తీస్తున్నాడు.ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి నిద్రపోయే వరకు మొబైల్ ఫోన్ మన జీవితంలో భాగమైపోయింది. సమాచారం కోసం ఉపయోగపడాల్సిన సాంకేతికత.. కొన్నిసార్లు మన సమయాన్ని పూర్తిగా ఆక్రమిస్తోంది. ముఖ్యంగా యువతలో సోషల్ మీడియా వినియోగం పెరగడంతో ఇతరులతో తమ జీవితాన్ని పోల్చుకోవడం, అనవసరమైన ఆందోళనకు గురికావడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయి.

డబ్బు మాత్రమే జీవితం కాదు

ప్రస్తుత సమాజంలో ఆర్థిక స్థిరత్వం చాలా అవసరం. కానీ డబ్బు సంపాదించడమే జీవితానికి ఏకైక లక్ష్యంగా మారకూడదు. అధిక ఆదాయం కోసం ఎక్కువ గంటలు పనిచేస్తూ ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తే సంపాదించిన దాని ప్రయోజనం ఏమిటన్న ప్రశ్న తలెత్తుతుంది.కుటుంబ సభ్యులతో కలిసి కొంత సమయం గడపడం, స్నేహితులతో మాట్లాడటం, ప్రకృతిలో కొంతసేపు గడపడం, నచ్చిన పనులకు సమయం కేటాయించడం కూడా జీవితంలో భాగం కావాలి. మానసిక ప్రశాంతత లేకుండా ఎంత సంపాదించినా జీవితం సంపూర్ణంగా మారదు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

మారుతున్న జీవనశైలితో ఆహారపు అలవాట్లు కూడా మారిపోయాయి. సమయానికి భోజనం చేయకపోవడం, బయట ఆహారానికి అలవాటు పడటం, శారీరక శ్రమ తగ్గిపోవడం వంటి కారణాలు ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. వ్యాయామానికి రోజులో కొంత సమయం కేటాయించడం, సమతుల ఆహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం ప్రతి ఒక్కరి బాధ్యత.ఆరోగ్యం దెబ్బతిన్న తర్వాత చికిత్స కోసం పరుగులు తీయడం కంటే.. ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం. చిన్న చిన్న జీవనశైలి మార్పులే భవిష్యత్తులో పెద్ద సమస్యలను నివారించగలవు.

సమయమే నిజమైన సంపద

మనిషికి డబ్బు పోతే తిరిగి సంపాదించుకునే అవకాశం ఉంటుంది. కానీ గడిచిపోయిన సమయాన్ని తిరిగి పొందడం సాధ్యం కాదు. అందుకే సమయాన్ని సరిగ్గా వినియోగించుకోవడం అవసరం. పని, కుటుంబం, ఆరోగ్యం, వ్యక్తిగత అభివృద్ధి.. వీటన్నింటికీ సమతుల్యత ఉండాలి.అభివృద్ధి అంటే కేవలం ఆర్థికంగా ఎదగడం కాదు. ఆరోగ్యంగా ఉండటం, కుటుంబంతో సంతోషంగా గడపడం, సమాజానికి ఉపయోగపడటం, మానసిక ప్రశాంతతను పొందడం కూడా అభివృద్ధిలో భాగమే.వేగంగా మారుతున్న ప్రపంచంలో మనిషి కూడా మారాల్సిందే. కానీ ఆ మార్పులో మనిషితనం, కుటుంబ విలువలు, ఆరోగ్యం, మానసిక ప్రశాంతతను కోల్పోకూడదు. జీవితం ఒక పరుగు కాదు.. ఒక ప్రయాణం. ఆ ప్రయాణాన్ని ఎంత వేగంగా పూర్తి చేశామన్నదికంటే, ఎంత సంతోషంగా సాగించామన్నదే అసలైన విజయం.

## శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం

**వలిగొండ, సెప్టెంబర్ 05 (దేశ టైమ్స్):**

మండల కేంద్రంలోని శ్రీ పైళ్ల మల్లారెడ్డి సాధనతో నిర్మించిన శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. నరేందర్‌రెడ్డితో పాటు అధ్యాపకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతో పాటు జీవితంలో సరైన మార్గంలో నడిచేలా ప్రోత్సహించడం కూడా ఉపాధ్యాయుల బాధ్యతని అన్నారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ విద్య ఎంతో ముఖ్యమైన దశ అని, ఈ దశలోనే భవిష్యత్తుపై స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని దాన్ని సాధించే దిశగా కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పరుశరాములు, హనీఫ్, వెంకటాచారి, మురళి, విజయ్‌కుమార్, సురేష్, బిక్షం, స్వప్న, సైదా, రవి, కృష్ణ, గణేష్‌కుమార్, గోపి, మృదుల, ఆనంద్ తదితరులతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



## లక్కీ లాటరీ సీఎం రేవంత్‌ను కూల్చే రోజులు త్వరలోనే ఉన్నాయి: కేటీఆర్

**మొదటి పేజీ తరువాయి)**

రేవంత్ రెడ్డి ఓ లెక్కే కాదన్నారు. ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ పేరిట పెద్ద పెద్ద మాటలు చెప్పిన కాంగ్రెస్ నేతలు, అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు ఇవ్వడం మానేసి లూటీఫికేషన్‌లు నడుపుతున్నారని మండిపడ్డారు.ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలంటున్న కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా, లేక ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచించిన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. ప్రజలకు చేసిన 420 రకాల మోసాలకు గానూ రేవంత్ రెడ్డి 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు రాబోతున్నాయని హెచ్చరించారు. మంత్రులు కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తమ ప్రభుత్వం 2.32 లక్షల ఉద్యోగాలు ఇస్తే, ఈ వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ఇచ్చినవి కేవలం 16 వేల ఉద్యోగాలేనని చెప్పారు. ఉద్యోగాల కల్పనపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

## సమస్యలు గాలికొదిలేసి దేనికి ఈ సంబరాలు?: రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం

**మొదటి పేజీ తరువాయి)**

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాగిస్తున్న పరిపాలనా విధానాన్ని, ఆయన పనితీరును ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కుంభకోణాలమయంగా మారిపోయిందని హరీశ్ రావు ఆరోపించారు. హామీలు నెరవేర్చడంలో విఫలమైన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని తాము డిమాండ్ చేస్తుంటే, బాధ్యతారాహిత్యంగా కేసీఆర్ రాజీనామా చేయాలనడం విడ్డూరంగా ఉందన్నారు. రాజీనామా చేయాల్సింది కేసీఆర్ కాదని, ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డేనని తేల్చిచెప్పారు.విద్యార్థులు, నిరుద్యోగుల ఆవేదన, జీఓ 97 రద్దు, రైతాంగానికి నమ్మకమైన ఉచిత విద్యుత్ సరఫరా వంటి కీలక ప్రజా సమస్యలే ఎజెండాగా రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ గళమెత్తుతుందని తెలిపారు. సభలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు అధినేత కేసీఆర్ బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో పూర్తి దిశానిర్దేశం చేస్తారని హరీశ్ రావు స్పష్టం చేశారు.

## పెన్షనర్లకు చంద్రబాబు భారీ ఊరట.. అడిషనల్ క్వాంటం పెన్షన్ పునరుద్ధరణ.. ఉద్యోగులకు కీలక హామీలు

**మొదటి పేజీ తరువాయి)**

స్టాఫ్ కౌన్సిల్ నేతలతో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరిస్తూనే, ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.వచ్చే ఏడాది జనవరి నుంచి పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం, 70 ఏళ్లు దాటిన పెన్షనర్లకు 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం అదనపు పెన్షన్ అందనుంది. ఉద్యోగుల చిరకాల డిమాండ్ అయిన 12వ పే-రివిజన్ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటుకు కూడా సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న 4 డీఏలలో రెండింటిని విడుదల చేయడానికి అంగీకరించారు. 1-7-2024, 1-1-2025 తేదీలకు చెందిన ఈ రెండు డీఏలను 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లించనున్నారు. 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవుల మొత్తాన్ని వచ్చే సంక్రాంతికి ఉద్యోగుల ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు. పోలీసులకు ఒక అదనపు సరెండర్ లీవ్‌ను ఈ దసరాకే చెల్లించేందుకు సుముఖత చూపారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీం (ఈహెచ్ఎస్)ను క్రమబద్ధీకరించి, వచ్చే నెల నుంచే ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. ఈ నిర్ణయాల వల్ల ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.2,880 కోట్ల అదనపు భారం పడనుంది.

గత పాలనలో ఉద్యోగులకు అవమానాలు: సీఎం చంద్రబాబు

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, “మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలి. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా... గత రెండేళ్ల కాలంలో ఒకటో తేదీన క్రమం తప్పకుండా జీతాలు ఇస్తున్నాం.. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు ఇస్తున్నాం. 11 వేల మంది సీపీఎస్ ఉద్యోగులకు ఓపీఎస్ వర్తింపచేశాం. ఉద్యోగులకు సంబంధించి ఉన్న పెండింగ్ బిల్లుల్లో ఇప్పటి వరకు రూ.30,849 కోట్లు క్లియర్ చేశాం. గత ప్రభుత్వం ఇష్టానుసారంగా వడ్డీలకు అప్పులు తెచ్చింది. ఆర్థిక సంస్థలతో చర్చించి రూ.1.50 లక్షల కోట్ల మేర అప్పులపై భారీగా ఉన్న వడ్డీలను రీ షెడ్యూల్ చేసి తగ్గించుకోగలిగాం. ప్రస్తుతం సరాసరి 9.1 శాతం వడ్డీని ప్రభుత్వం అప్పులపై చెల్లిస్తోంది. ఈ భారాన్ని ఇంకా తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. విధ్వంసమైన వ్యవస్థలను నెమ్మదిగా గాడిన పెడుతున్నాం. గత పాలకులు ఉద్యోగులను దగ్గరకే రానీయలేదు. రివర్స్ పీఆర్సీ ఇచ్చారు... అలాంటి పరిస్థితులు ఉద్యోగులు మరిచిపోవద్దు. గత ప్రభుత్వం రిటైరైన ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్‌ను కూడా పెండింగులో పెట్టింది. ఉద్యోగులను అవమానించేలా వాలంటరీలతో కరపత్రాలు పంపిణీ చేయించారు.. హోర్డింగులు పెట్టించారు... పేపర్లో ప్రకటనలు ఇచ్చారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మధ్యవర్తులతోనే మాట్లాడే పరిస్థితి నాడు ఉండేది. సమస్యల పరిష్కారం కోసం నాటి సీఎం కాళ్లు పట్టుకోవాలని అప్పుడు మంత్రులుగా ఉన్న వారు కామెంట్లు చేశారు... అవమానించారు. మంచికి చెడుకు ఉన్న వ్యత్యాసాన్ని ఉద్యోగులందరూ గుర్తించాలి. మేం ఉద్యోగులను గౌరవిస్తున్నాం... సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో ఉన్నాం. రిటైర్డ్ ఉద్యోగులు ఇబ్బందులు పడకూడదని వారి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిచ్చాం. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ సానుకూలంగా ఉంటాం. ఆర్థిక వెసులుబాటు ఉంటే ఉద్యోగులకు సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. 2014లో నాడు విభజన తర్వాత ఉద్యోగుల సంక్షేమానికి పెద్ద పీట వేశాం. విభజనకు వ్యతిరేకంగా పోరాడింది ఉద్యోగులే. వారిని గౌరవించాలని.. ఇబ్బందులు వస్తాయని తెలిసినా... 43 శాతం ఫిట్మెంట్ ఇచ్చాం. ఉద్యోగులు వారి సమస్యల గురించి.. యూనియన్ల కోసం పని చేస్తారు. నేను రాష్ట్రం కోసం... ప్రజల కోసం ఆలోచించాలి. ఇందులో ఉద్యోగులూ భాగమే”అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

## అది విద్యా వ్యవస్థా లేక కార్పొరేట్ దోపిడీ వ్యవస్థా?: ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల మోతపై రేవంత్‌ను నిలదీసిన కవిత

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల కట్టడికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ ఫీ రెగ్యులేటరీ కమిషన్‌ను తీసుకొస్తామని గతంలో ఇచ్చిన హామీ ఏమైందని, దానికి సంబంధించిన డ్రాఫ్ట్ బిల్లు రెండేళ్లుగా కేబినెట్ దాటి బయటకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. స్వయంగా విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న సీఎం రేవంత్ రెడ్డి... పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల జేబులు గుల్లవుతున్నా ఎందుకు మౌనం వహిస్తున్నారని నిలదీశారు.ప్రభుత్వ భూముల్లో నడిచే హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ సైతం ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచినా సర్కార్ మౌనంగా ఉండటం కార్పొరేట్ విద్యా వ్యాపారులకు బాసటగా నిలవడమేనని కవిత ఆరోపించారు. 1994 నాటి జీవో ప్రకారం వార్షిక ఫీజుల పెంపు 5 శాతానికి మించకూడదన్న స్పష్టమైన నిబంధన ఉన్నా దానిని పక్కనబెట్టి, విద్యా వ్యవస్థను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. రాబోయే శాసనసభ సమావేశాల్లోనే తక్షణమే పాఠశాల ఫీజుల నియంత్రణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని, లేనిపక్షంలో బాధితులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## గ్లోబల్ లీడర్లలో మోదీ అత్యంత స్ఫూర్తిదాయకం: బెల్జియం ప్రధాని ప్రశంసల వర్షం

**మొదటి పేజీ తరువాయి)**

కానీ ప్రధాని మోదీ మాట్లాడితే ఆయన చెప్పిన దార్శనికతను అనుసరించాలనే నమ్మకం, స్ఫూర్తి కలుగుతాయని వ్యాఖ్యానించారు. విశ్వవేదికపై భారత్ పాత్ర అత్యంత కీలకంగా మారిందని కొనియాడిన బెల్జియం ప్రధాని... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను బెల్జియం ఒక విశ్వసనీయ భాగస్వామిగా చూస్తోందని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇదే సమయంలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలు, టారిఫ్‌లపై ఆయన పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఏ క్షణాన ఏ నిర్ణయం తీసుకుంటారో తెలియని అస్థిరత వల్ల ప్రపంచ వాణిజ్యమే ప్రమాదంలో పడుతుందని... స్వేచ్ఛా వాణిజ్యం, బలమైన ద్వైపాక్షిక భాగస్వామ్యాల ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

## కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి: పొన్నం ప్రభాకర్ డిమాండ్

**మొదటి పేజీ తరువాయి)**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలు నిర్వర్తించని వ్యక్తి ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ‘మహా ధర్నా’ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. “వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా వేతనం తీసుకుంటున్న కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, కనీసం తన నియోజకవర్గ ప్రజలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రతిపక్ష నేతగా ఆయన పూర్తిగా విఫలమయ్యారు” అని ఆరోపించారు. కేసీఆర్ వైఖరిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికే ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇదే వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

## ఉద్యమకారుల హక్కుల కోసం గొంతుకగా పనిచేస్తాం: సంగిశెట్టి క్రిస్టఫర్

**వలిగొండ సెప్టెంబర్ 05 (దేశ టైమ్స్):**



తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరే వరకు ఉద్యమకారుల గొంతుకగా పనిచేస్తానని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడానికి ప్రత్యేక వెబ్ సైట్ ప్రారంభిస్తామని చెప్పడం హర్షించ దగ్గ విషయమని అన్నారు. విధి విధానాలతో వెబ్సైట్ తొందరలో ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. అనేక మంది ఉద్యమకారులు రాష్ట్ర సాధన కోసం పోలీసు కేసులు జైలు నిర్బంధాలు ఎదుర్కొని అనేక అవస్థలు పడ్డారని వారిని గుర్తించడానికి వెంటనే వెబ్సైట్ ప్రారంభించాలని క్రిస్టఫర్ అన్నారు. ఉద్యమకారులు ఎప్పుడెప్పుడా అని వెబ్సైట్ కోసం ఎదురుచూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఉద్యమకారులకు మధ్య వారధిగా పని చేస్తానని ఉద్యమకారుల హక్కులు సాధించే వరకు విశ్రమించేది లేదని అన్నారు.

RNI NO. TELTEL2010/34557
తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం



# వెయ్యి రోజుల ప్రజా పాలన.. మరిపెడలో కాంగ్రెస్ భారీ ర్యాలీ





**ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన**

**రైతు, పేద, మహిళ, యువత సంక్షేమానికి పెద్దపీట**

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్**

**దేశ టైమ్స్మహబూబాబాద్/మరిపెడ, సెప్టెంబర్ 5**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా మరిపెడ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీమరిపెడ మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుగులోత్ రవి నాయక్, ఆధ్వర్యంలో శనివారం రోజున భారీ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీకి నాయకత్వం వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో మరిపెడలో సందడి నెలకొంది.కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, వెయ్యి రోజుల ప్రజా పాలన సందర్భంగా ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ ర్యాలీ నిర్వహించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ర్యాలీలో కాంగ్రెస్ శ్రేణులు పార్టీ జెండాలు చేతబూని ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు, పేదలు, మహిళలు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమ పాలనకు ప్రభుత్వం బాటలు వేస్తోందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

## రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

రైతుల సంక్షేమమే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని ఎమ్మెల్యే అన్నారు. రైతులకు అండగా నిలిచే విధంగా ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం, రైతులకు అవసరమైన సహకారం అందించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలుస్తున్నామని, మహిళలు, యువతకు అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.అన్ని మతాలు, వర్గాలకు సమాన గౌరవం కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాలు, కులాలు, వర్గాలను సమానంగా గౌరవిస్తూ ప్రజా పాలన సాగిస్తోందని రామచంద్రనాయక్ అన్నారు. ప్రజల విశ్వాసాలు, సంప్రదాయాలను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.హిందూ పండుగలు, సంప్రదాయాలు, ఆలయాల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా, సోదరభావంతో జీవించే వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

## వెయ్యి రోజులు.. ప్రజా పాలనకు నిదర్శనం

వెయ్యి రోజుల పాలన కేవలం ఒక సంఖ్య లేదా మైలురాయి కాదని.. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో సాగుతున్న ప్రజా పాలనకు ఇది ఒక నిదర్శనమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా ప్రజలకు చేరేలా కృషి చేస్తామని చెప్పారు. మరిపెడ నియోజకవర్గంలో కూడా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు.ప్రజల ఆశీర్వాదంతో మరింత అభివృద్ధిప్రజల ఆశీర్వాదం, సహకారంతో రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తామని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ శ్రేణుల భారీ సందడి

వెయ్యి రోజుల ప్రజా పాలన సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ ప్రధాన వీధుల గుండా సాగడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు.ఈ కార్యక్రమంలో పీసీసీ కోఆర్డినేటర్ హవేజ్ ఖాన్, మరిపెడ మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుగులోత్ రవి నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు రామ్ లాల్, జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ విజయ్ నాయక్, మైనార్టీ సెల్ నాయకులు తాజుద్దీన్, కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల చిరునవ్వుల మధ్య కొండా జన్మదిన వేడుకలు.. సేవా స్ఫూర్తిని చాటిన శ్రేయోభిలాషులు

**శాంతి నిలయంలో కేక్ కట్ చేసి పండ్లు, బిస్కెట్లు పంపిణీ.. పదవులకు అతీతంగా ప్రజాసేవే లక్ష్యమని వెల్లడి**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 5 (దేశ టైమ్స్):**

జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు దూరంగా నిర్వహిస్తూ.. వాటిని సేవా కార్యక్రమాలకు వేదికగా మలిచారు మాజీ జెడ్పీటీసీ, ప్రజా సేవకులు బానోత్ కొండా శ్రేయోభిలాషులు. బోనకల్ మండల కేంద్రంలోని శాంతి నిలయంలో శనివారం కొండా జన్మదిన వేడుకలను చిన్నారుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అనంతరం శాంతి నిలయంలోని చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.సాధారణంగా జన్మదిన వేడుకలు అంటే భారీగా కార్యక్రమాలు, హంగూ ఆర్భాటాలతో నిర్వహించుకోవడం పరిపాటిగా మారిన నేపథ్యంలో.. అందుకు భిన్నంగా నిరుపేద చిన్నారుల మధ్య వేడుకలు జరపడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు అందజేస్తూ వారితో ఆత్మీయంగా గడిపారు. దీంతో శాంతి నిలయంలో సందడి వాతావరణం నెలకొంది. జన్మదినాన్ని వ్యక్తిగత ఆనందానికే పరిమితం చేయకుండా.. సమాజంలో అవసరమైన వారికి చేయూతనిస్తూ జరుపుకోవడం ద్వారా సేవా స్ఫూర్తిని చాటారు.

## ప్రజాసేవే కొండా ఆశయం

ఈ సందర్భంగా సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు మాట్లాడుతూ.. బానోత్ కొండా రాజకీయ పదవులను హోదాగా, అధికారానికి ప్రతీకగా ఎప్పుడూ చూడరని అన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు లభించిన అవకాశంగానే రాజకీయ పదవులను భావిస్తూ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. పదవిలో ఉన్న సమయంలోనే కాకుండా పదవి లేని సమయంలోనూ ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, తనకు సాధ్యమైన మేరకు సహాయం చేయడం కొండా ప్రత్యేకత అని తెలిపారు.పేదలు, నిరుపేదలు, చిన్నారులకు అండగా నిలుస్తూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని సుధాకర్ రావు అన్నారు. ప్రజల కష్టాల్లో భాగస్వామిగా ఉండాలనే ఆలోచనతోనే జన్మదిన వేడుకలను కూడా చిన్నారుల మధ్య నిర్వహించడం అభినందనీయమన్నారు.

## ఆర్భాటం కంటే ఆత్మీయతకు ప్రాధాన్యం

జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు దూరంగా జరుపుకోవడం ద్వారా బానోత్ కొండా వ్యక్తిత్వంలోని సేవా భావం మరోసారి వెల్లడైందని అన్నారు. "పదవి ఉన్నా లేకపోయినా ప్రజల మధ్య ఉండి సేవ చేయాలనే తపన, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలనే మానవత్వం బానోత్ కొండా ప్రత్యేకత" అని సుధాకర్ రావు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ, కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలిచే కొండా భవిష్యత్‌లోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజా సేవలో మరింత ఉన్నతంగా ఎదగాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గుగులోతు రమేష్, గుగులోతు నాగేశ్వరరావు, తెల్లూరి రమేష్, చిట్టూరి ప్రసాద్, షేక్ మీరా సాహెబ్, మరిధు శేషు, జరుపుల శివకృష్ణ, షేక్ బాజీ, టైగర్ మల్లెల వేలాద్రి, గంగుల పుల్లయ్య, సాయి ఆదిత్య, సిద్దు, భూక్యా శీను, రాజగోపాల శ్రీను తదితరులు పాల్గొని బానోత్ కొండాకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# పేదల సొంతింటి కలను నెరవేర్చాలి

- **రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లను వెంటనే మంజూరు చేయాలి: సీపీఐ నేత యంగల ఆనందరావు**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 5 (దేశ టైమ్స్):**



రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను ప్రభుత్వం వెంటనే ప్రారంభించి అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు డిమాండ్ చేశారు.మండల కేంద్రంలోని తూము ప్రకాశరావు భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అనేక పేద కుటుంబాలు నేటికీ సొంత ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు కలిసి జీవించాల్సిన దుస్థితి నెలకొందన్నారు.మొదటి విడతలో అర్హత ఉన్నప్పటికీ ఇళ్లు మంజూరు కాని కుటుంబాలు రెండవ విడత కోసం ఎదురుచూస్తున్నాయని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబాన్ని గుర్తించి రాజకీయ జోక్యాలకు తావులేకుండా పారదర్శకంగా ఇళ్లను మంజూరు చేయాలని కోరారు.పేదల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆనందరావు విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చొరవ తీసుకుని రెండవ విడత ఇళ్ల మంజూరుకు శ్రీకారం చుట్టాలని కోరారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పరిశీలించిన ఆర్డీవో

**రుద్రంగి సెప్టెంబర్ 5 (దేశ టైమ్స్)**



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి లో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ SIR ప్రక్రియను ఆర్డీవో బిఎన్ఎస్ కుమారి పరిశీలించారు.ఈ సందర్భంగా బిఎల్వోలకు పలు సూచనలు చేశారు.ఎస్ఐఆర్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అన్నారు.ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న ఓటర్ పూర్తి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అలాగే ఓటర్ సమర్పించిన ఎస్ఐఆర్ ఫారంలో ఏవైనా మార్పులు చేర్పులు ఉంటే సరిచేయాలని సూచించారు. బిఎల్వోలు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు.ప్రతి ఓటరు తమ ఓటు పేరు బీఎల్ఓల వద్ద ఉన్న ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని కోరారు,మొదటిసారి రుద్రంగి గ్రామానికి వచ్చిన ఆర్డీవో ను సర్పంచ్ గండి నారాయణ శాలువతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో, తహశీల్దార్ పుష్పలత,వర్డు మెంబర్ శీలం మీనయ్య,ఉన్నారు......

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి (ఉపాధ్యాయ దినోత్సవం)

**రుద్రంగి సెప్టెంబర్ 5 (దేశ టైమ్స్)**




రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు నిర్వహించారు.అలాగే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులను, ఉపాధ్యాయురాళ్లను ఘనంగా శాలువాలతో సన్మానించారు. అనంతరం కృష్ణవేణి గ్రూప్ ఛైర్మన్ రాజు సంగాని హైదరాబాద్ నుండి పంపిన ఉపాధ్యాయ అభినందన పత్రాలను పాఠశాల యాజమాన్యనికి అందజేశారు.ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల డైరెక్టర్ తీపిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.అన్ని వృత్తుల వారిని తయారు చేసే ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదని కొనియాడారు.అలాగే పాఠశాల ప్రిన్సిపాల్ హరినాథ్ రాజ్ మాట్లాడుతూ.ఇలాంటి సత్కారాల వల్ల ఉపాధ్యాయులకు మరింత బాధ్యత పెరుగుతుందని అన్నారు.అలాగే హైదరాబాద్ సెంట్రల్ ఆఫీస్ నుండి ఛైర్మన్ రాజు సంగాని పంపిన అభినందన పత్రాలకు గాను ఛైర్మన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్,డైరెక్టర్లు తీపిరెడ్డి వెంకట్ రెడ్డి,ఎర్రం గంగనర్సయ్య,పడల సురేష్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు....

# కేరళ గ్లోబల్ హై స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**రుద్రంగి సెప్టెంబర్ 5 (దేశ టైమ్స్)**

ఉపాధ్యాయ లోకానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శమని అందుకే ఆయన జయంతి ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటామని విద్యార్థులకు ఉపాధ్యాయులు తెలిపారు.రుద్రంగి మండలకేంద్రంలోని కేరళ గ్లోబల్ హై స్కూల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు నిర్వహించారు.సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం చైర్మన్ బాబు నంబియార్, మాట్లాడుతూ.తత్వవేత్తగా సర్వేపల్లి రాధాకృష్ణ సమాజానికి చేసిన మేలు నేటికీ ఆదర్శనీయమన్నారు.ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన సర్వేపల్లి ఉప రాష్ట్రపతిగా,రాష్ట్రపతిగా దేశానికి విశేష సేవలందించారని గుర్తు చేశారు.నేటితరం ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆలోచనా విధానాలను ముందుకు తీసుకెళ్లి ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని అన్నారు.అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లతిక,పాటశాల ఇంచార్జ్ నరిగే విజయ్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



RNI NO. TELTEL2010/34557

తెలుగు దినపత్రిక

దేశ టైమ్స్

సత్యం కోసం .... సమాజం కోసం

## పవిత్రాత్మ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**వలిగొండ : సెప్టెంబర్ 5 ( దేశ టైమ్స్)**




డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని వలిగొండ మండల కేంద్రంలోని పవిత్రాత్మ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ సవిత మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనదని,వారు తమ జీవితాన్ని విద్యార్థులకు ధారపోసి ఉన్నత విద్యను అభ్యసించడానికి కృషి చేస్తున్నటువంటి బాధ్యత ఉపాధ్యాయ వృత్తిపై ఉన్నదని కొనియాడారు. అనంతరం విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి ఉపాధ్యాయులను క్రీడలను నిర్వహించి ఆనందపరిచారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ జెనిఫర్,సిస్టర్ రోస్,సిస్టర్ లిడియా,సిస్టర్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగులకు ఘన సన్మానం





**వలిగొండ, సెప్టెంబర్ 05 (దేశ టైమ్స్):**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శ్రీ వెంకటేశ్వర కాలనీలో రిటైర్డ్ ఉద్యోగులను కాలనీ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కాలనీ గౌరవ అధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి, అధ్యక్షులు భీమీడి యాదిరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు రిటైర్డ్ ఉద్యోగులను ఘనంగా శాలువాతో సన్మానించారు.అనంతరం కాలనీలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను కాలనీ కమిటీ సభ్యులు, కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని పర్యవేక్షించి, పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డా. సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళులు

**దేశ టైమ్స్‌మహబూబాబాద్/మరిపెడ, సెప్టెంబర్ 5**



ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ ఉపాధ్యాయులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భారత మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త, ఆదర్శ ఉపాధ్యాయుడు డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులకు జ్ఞానం, వివేకం అందిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో అమూల్యమైనదని అన్నారు. ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో గురువుల సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశ ప్రగతికి బాటలు వేస్తున్న ఉపాధ్యాయుల జ్ఞానం, మార్గదర్శనం, అంకితభావం ప్రతి విద్యార్థి జీవితంలో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో మరిపెడ మండల అధ్యక్షులు గుగులోత్ రవి నాయక్, మున్సిపల్ చైర్మన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు రామ్ లాల్, వార్డు కౌన్సిలర్లు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సీఎం సభకు బయలుదేరిన వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు

**వలిగొండ: సెప్టెంబర్ 5 :(దేశ టైమ్స్)**

నకిరేకల్ లో జరిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు నకిరేకల్ లో నిర్వహించిన ప్రజా వికాస్ సభకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి నాయకత్వంలో తరలి వెళ్లారు ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డిమాట్లాడుతూ నకిరేకల్ లో జరిగిన రేవంత్ రెడ్డి సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి బ్రహ్మరథం పట్టారని వారన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిరస్థాయిగా నిలిచాడని అన్నారు గత పాలకులు ప్రజాసంక్షేమా న్ని పూర్తిగా విస్మరించారని కానీ రేవంత్ రెడ్డి సర్ కార్ అధికారంలోకి వచ్చాక నిరంతరం ప్రజల కోసం పనిచేస్తూ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడం జరుగుతుందని వారన్నారు కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలనుప్రజలు ఆదరిస్తున్నా రని వచ్చే ఐదు ఏళ్ళు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని వారు స్పష్టంగా చేశారు సభకు తరలి వెళ్లిన వారిలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శులు చెరుకు శివయ్య గౌడ్ మస్కు నరసింహ ఎలిమినేటి సత్యనారాయణ కాసుల వెంకన్న గౌడ్ రాజశేఖర్ రెడ్డి కొండూరు సాయి బత్తిని పాండు బత్తిని వరుణ్ తదితరులు ఉన్నారు



# ఉపాధ్యాయుల పాత్రలో ఒదిగిన విద్యార్థులు.. స్మార్ట్ కిడ్జ్‌లో సందడిగా స్వయంపాలన దినోత్సవం















**డీఈఓ నుంచి అటెండర్ వరకు వివిధ పాత్రల్లో విద్యార్థుల సేవలు.. తరగతి గదుల్లో పాఠాలు బోధించిన 'చిన్నారుల టీచర్లు'**

**ఖమ్మం, సెప్టెంబర్ 5 (దేశ టైమ్స్):**

ఉపాధ్యాయులంటే కేవలం పాఠాలు చెప్పేవారు మాత్రమే కాదు.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే మార్గదర్శకులనే విషయాన్ని ఆచరణాత్మకంగా తెలుసుకునేలా స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని శనివారం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమంలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తరగతులకు బోధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాధారణంగా తరగతి గదుల్లో ఉపాధ్యాయుల నుంచి పాఠాలు వినే విద్యార్థులు.. ఈసారి ఉపాధ్యాయుల స్థానాల్లో కూర్చొని తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కొందరు విద్యార్థులు డీఈఓలు, హెడ్మాస్టర్లు, వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులు, పీఈటీలు, అటెండర్లుగా ప్రత్యేక వస్త్రధారణలో కనిపిస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను ఉత్సాహంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల మాదిరిగా తరగతి గదులను నిర్వహించడం, విద్యార్థులకు పాఠాలు చెప్పడం, క్రమశిక్షణను పాటించేలా చూడటం వంటి బాధ్యతలను చేపట్టారు.

గురువుల బాధ్యతను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం

స్వయంపాలన దినోత్సవం ద్వారా విద్యార్థులకు ఉపాధ్యాయుల బాధ్యతలు, వారి పనితీరు, విద్యార్థుల పట్ల వారు చూపించే శ్రద్ధ వంటి అంశాలను ప్రత్యక్షంగా అర్థం చేసుకునే అవకాశం లభించింది. పాఠాలు బోధించడం వెనుక ఉన్న కృషి, ఓర్పు, బాధ్యతను విద్యార్థులు స్వయంగా అనుభవించారు. దీంతో ఉపాధ్యాయుల పట్ల మరింత గౌరవభావం పెంపొందేలా కార్యక్రమం సాగింది. కార్యక్రమం ప్రారంభంలో భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయుల సేవలు ఆదర్శనీయం ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. పాఠశాలలో ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న బాధ్యతలను విద్యార్థులు అర్థం చేసుకునేలా స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులను విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు నిరంతరం చేస్తున్న కృషిని ఈ కార్యక్రమం ద్వారా తెలియజేశామని అన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రను పోషించడం వల్ల బోధనలో ఉన్న బాధ్యత, సమయపాలన, క్రమశిక్షణ, సహనం వంటి విలువలను తెలుసుకునే అవకాశం కలిగిందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, బాధ్యతాయుత ఆలోచనా విధానం పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప గురువుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే కాకుండా భారతదేశానికి రెండవ రాష్ట్రపతిగా సేవలందించి దేశానికి ఆదర్శంగా నిలిచారని కృష్ణ చైతన్య గుర్తుచేశారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయులను పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గురువులకు ఘన సన్మానం.. పాటలతో మార్మోగిన షైన్ హైస్కూల్

**ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో విద్యార్థుల సందడి.. పండగ వాతావరణాన్ని తలపించిన పాఠశాల ప్రాంగణం**

**ఖమ్మం, సెప్టెంబర్ 5 (దేశ టైమ్స్):**




గురువుల సేవలను స్మరించుకుంటూ స్థానిక షైన్ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమకు విద్యాబుద్ధులు నేర్పుతున్న ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం చేశారు. గురువుల గొప్పతనాన్ని కొనియాడుతూ విద్యార్థులు ఆలపించిన పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీంతో పాఠశాల ప్రాంగణమంతా సందడి నెలకొని, పండగ వాతావరణాన్ని తలపించింది. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు తమ గురువుల పట్ల ఉన్న గౌరవం, అభిమానాన్ని వివిధ కార్యక్రమాల ద్వారా వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు సన్మానం చేసి వారి సేవలను కొనియాడారు. అనంతరం గురువుల గొప్పతనాన్ని వివరిస్తూ విద్యార్థులు పాటలు పాడటంతో పాఠశాల ఆవరణలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది

ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని అన్నారు. విద్యార్థులకు విద్యను అందించడంతో పాటు వారి భవిష్యత్తుకు సరైన మార్గాన్ని చూపే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల డైరెక్టర్ లాల్ మహమ్మద్ మాట్లాడుతూ.. సమాజం సక్రమమైన మార్గంలో ముందుకు సాగాలంటే ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని నేర్పడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.

మేధావులను తీర్చిదిద్దే బాధ్యత గురువులదే

పాఠశాల ప్రిన్సిపాల్ శ్వేత మాట్లాడుతూ.. ఏ రంగంలోనైనా ప్రతిభావంతులు, మేధావులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని అన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారికి సరైన దిశానిర్దేశం చేయడం ద్వారా ఉన్నత శిఖరాలకు చేర్చే శక్తి గురువులకు ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయుల సూచనలు, సలహాలను పాటిస్తూ ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా, డైరెక్టర్ లాల్ మహమ్మద్, ప్రిన్సిపాల్ శ్వేత, అడ్మినిస్ట్రేటర్ వేలాద్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన గుడిపూడి నవీన్ రావు

**దేశ టైమ్స్ మహబూబాబాద్/ మరిపెడ, సెప్టెంబర్ 5**



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బురహాన్‌పురం గ్రామానికి చెందిన నల్లబోలు ప్రవీణ్ రెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు శనివారం బురహాన్‌పురంలోని మృతురాలి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించిన నవీన్ రావు, కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతురాలి మృతి కుటుంబానికి తీరని లోటని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. దుఃఖ సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. నల్లబోలు ప్రవీణ్ రెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ గంట్ల సుజాత--మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280